# ఆ రాత్రి...

ఆదిత్య



పంకజ్ డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిల్చొని పదోసారి తల దువ్వుకున్నాడు. తూనీగ రెక్కల్లాంటి నల్లని తల వెంట్రుకల మధ్యన ఛటుక్కున ఓ వెండి తీగ మెరిసినట్లయింది. ఆ వెండి తీగను చూస్తూనే గుండె వేగంగా కొట్టుకోసాగింది. గొంతెత్తి ''మిన్నీ వస్తావా రావా..?'' అంటూ అరిచాడు. కిచెన్‌లో వంట పాత్రలు సర్దుతున్న మిన్నీ పంకజ్ అవస్థను తలచుకొంటూ మనసులోనే నవ్వుకుంది. గడియారం వైపు చూసింది. రాత్రి పదకొండు గంటలు కావస్తుంది, ఇంక మరీ ఆలస్యం చేస్తే పంకజ్‌కు మెంటలెక్కే అవకాశం ఉందనిపించింది. కిచెన్ తలుపులేసి చేతిలో పాల గ్లాసుతో బెడ్ రూమ్‌లో అడుగుపెట్టింది.

# నేరము శిక్ష

బెడ్‌రూమ్‌లో డబుల్ కాట్ బెడ్‌పై ముని పుంగవుడిలా మఠం వేసుకొని కళ్ళు మూసుకుని, జపం చేస్తూ కూర్చుని ఉన్న పంకజ్‌ను చూస్తూనే నవ్వాపు కోలేకపోయింది మిన్నీ.

ఆ నవ్వుకు తపోభంగమయినట్లు కళ్ళు తెరిచాడు పంకజ్.

''నీకోసం పిలిచి పిలిచి..వేచి వేచి.. ఇదిగో ముసలాణ్ణయిపోయాను..'' అన్నాడు కోపంగా.

''ముసలాడవటం ఏమిటి..?'' ఆశ్చర్యంగా అడిగింది మిన్ని.

''ఇదిగో సాక్ష్యం..'' అంటూ తల్లో మెరుస్తున్న వెండితీగను చూపించాడు.

''ఓ గాడ్..నన్నో ముసలాడికిచ్చి నా గొంతు కోసారు..'' నాటక ఫక్కీలో వాపోయింది మిన్నీ.

''చాల్లే నాటకాలు'' అంటూ మిన్నీని మీదకు లాక్కున్నాడు పంకజ్. మారు మాట్లాడకుండా గువ్వ పిట్టలా పంకజ్ గుండెలపై వాలిపోయింది మిన్నీ.

★★★

తెల్లవారగానే కళ్ళు కూడా తెరవకుండా బెడ్ కాఫీకై కేకలేయడం పంకజ్‌కు అలవాటు. తల నిండా కప్పుకున్న దుప్పటి కూడా తీయకుండా ''మిన్నీ.. మిన్నీ..'' అంటూ అరవసాగాడు పంకజ్.

ఎంత పిలిచినా సమాధానం రాకపోవడంతో దుప్పటి విసిరేసి లేచి కూర్చుని మళ్ళీ ''మిన్నీ.. కాఫీ..క్విక్..''అంటూ కేకలేయసాగాడు.

ఆ వెంటనే తలతిప్పి చూశాడు. తన పక్కనే కదలకుండా పడుకుని ఉంది మిన్నీ. ఇదేంటి మిన్నీ ఇంకా లేవలేదా అనుకుంటూ ''మిన్నీ లే'' అంటూ కుదిపి చూశాడు.

మిన్నీ ఒళ్ళు చల్లగా వుంది. నాడి పట్టుకుని చూశాడు. అంతే పంకజ్ గుండె ఝల్లుమంది.

మిన్నీ మృతి చెందింది.

''మిన్నీ..మిన్నీ..''అంటూ దిక్కులు పిక్కటిల్లేలా కేకేశాడు. ఆ కేకకు చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు కూడా ఉలిక్కిపడ్డారు.

నిమిషాల్లో అక్కడి దృశ్యం మారిపోయింది. పోలీసులు రంగప్రవేశం చేశారు. ఎస్.ఐ. రమా కంత్ భార్గవ్ పంకజ్‌ను అరెస్ట్ చేసి, మిన్నీ శవాన్ని పరిశీలనగా చూశాడు.

మిన్నీ గొంతు నులమడం వల్ల చనిపోయినట్టు తెలుస్తోంది. మెడ భాగంలో గోళ్ళ రక్కులు కని పించాయి. పంకజ్ గోళ్ళల్లో కూడా మాంసం తున కలు కనిపించాయి ఎస్. ఐ.కు

''మిస్టర్ పంకజ్.. ఎందుకీ దారుణం చేశావు?'' అంటూ నిలదీసాడు.

''నాకేం తెలీదు..అసలిదంతా ఏదో మాయలా వుంది..'' అయోమయంగా అన్నాడు పంకజ్.

''పంకజ్ నువ్వు బుకాయించి లాభం లేదు. నీ గోళ్ళలోని చర్మం తునకలేసాక్ష్యం..''

''రాత్రి మిన్నీ చికెన్ వండింది. దాని తాలుకు తునకలే ఇవి కావాలంటే చూడండి..'' అంటూ ఫ్రిజ్‌లోని చికెన్‌కర్రీ చూపించాడు.

''మరీ హత్య ఎలా జరిగింది?''

''లీలగా ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. నాకొక కల వచ్చింది. అందులో ఖాకీ యూనిఫాం వేసు కున్న వ్యక్తి ఒకరు మిన్నీతో పెనుగులాడుతుండడం కనిపించింది. కలే కదా..''అని కళ్ళు తెరవలేదు. అంటూ ఒక్కసారిగా ''బహద్దూర్..బహద్దూర్..'' అంటూ అరిచాడు.

''ఎవరీ బహద్దూర్..?''

''మా సెక్యూరిటీ గార్డ్.. ఉండండి వాణ్ణి పిలు స్తాను'' అంటూ బయటకు వెళ్ళి చూశాడు ఎక్కడా బహద్దూర్ జాడలేదు.

''సార్.. నాకు కలలో కనిపించిన వ్యక్తి బహద్దూర్. వాడే ఈ హత్య చేసుంటాడు అందుకే కనిపించ కుండా పారిపోయి ఉంటాడు'' అన్నాడు పంకజ్.

''వాడి అడ్రస్ లేదా..?''

''ఉండండి చూస్తాను'' అంటూ డైరీలోని బహద్దూర్ అడ్రస్ ఇచ్చాడు.

చాందినీ చౌక్ ప్రాంతంలో ఉందా ఇల్లు.

★★★

కుసుమ్ వంటింట్లో చపాతీలు కాలుస్తోంది. ఇంతలో తలుపు తట్టిన చప్పుడవడంతో– ''ఎవరూ..?'' అంటూ ముందు గదిలోకి వెళ్ళి తలుపు తీయబోయింది.

పక్కన మంచంపై పడుకుని వున్న బహద్దూర్ ఉలిక్కిపడి లేచి '' ఏయ్ తలుపు తెరవకు.. ముందుగా ఎవరొచ్చారో కనుక్కో'' అన్నాడు భయంగా.

అలాగే అన్నట్లుగా తలూపి కొద్దిగా తలుపు తెరిచింది కుసుమ్. ఆ కొద్దిపాటి వ్యవధిలోనే తలుపులు తోసుకుని పోలీసులు లోపలికి ప్రవేశం చారు. ''ఏయ్ బహద్దూర్ ఎక్కడ?'' అరిచాడు ఎస్.ఐ. రమాకంత్. ఈ హడావిడికి దొడ్డిదారి గుండా గోడదూకి పారిపోయాడు బహద్దూర్.

ఆ విషయం గ్రహించిన ఎస్. ఐ రమాకాంత్ భార్గవ్ జీపు తీసుకుని బహద్దూర్ వెంటపడ్డాడు.

బహద్దూర్ శక్తినంతా కూడదీసుకుని పిక్క బలం కొద్దీ పరుగుతీయసాగాడు. ఆ వెనుకే పోలీ సులు కూడా పరుగుతీస్తున్నారు.

జీపులో రమాకాంత్ వెంటాడుతున్నాడు. బహద్దూర్ ఆయాసంగా వగరుస్తూ అదే ఊపులో సంధించిన బాణంలా దూసుకుపోతున్నాడు.

రోడ్డు మీద వాళ్ళంతా చోద్యం చూస్తున్నారు.

అలా అరగంట ఛేజింగ్ తర్వాత పోలీసులకు చిక్కాడు బహద్దూర్.

★★★

పోలీస్ స్టేషన్‌లో ఎస్. ఐ. రమాకాంత్ ''చెప్పు ఎందుకీ దారుణం చేశావు? మిన్నీని ఎందుకు చంపావు..?'' అంటూ నిలదీశాడు బహద్దూర్‌ని.

''నిజంగా నాకు తెలీదయ్యా..''

''బద్మాష్..నిజం చెబుతావా..? తోలు తీయ మంటావా..?'' బెదిరించాడు రమాకాంత్.

''మీరు నా తోలు తీసినా, ప్రాణం తీసినా నాకు ఈ హత్య గురించి ఏవీ తెలీదు..'' వాపోయాడు బహద్దూర్.

''మరెందుకు పారిపోయావు?''

''నేరం నా మీద పడుతుందన్న భయానికి పారి పోయా..అంతే..''

''పోనీ ఆ రాత్రి ఏం జరిగిందో చెప్ప గలవా..?''

''చెబుతానండయ్యా. నేను గేటు దగ్గర కాపలా కాస్తున్నాను. సుమారు అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో అయ్యగారి బెడ్‌రూమ్‌లో ఫోన్ మోగింది.

అయ్యగారు విసుక్కుంటూ లేచి ఫోన్ అందుకున్నారు. ఓ అయిదు నిమిషాల తర్వాత ఫోన్ పెట్టేసారు. అది జరిగిన కొద్ది సేపటికే మిన్నీ అమ్మ కేకలు వినిపించసాగాయి.

నేను కిటికీలోంచి చూస్తే పంకజ్ గారు అమ్మ గారి గొంతు నులమడం చూశాను.. భయంతో అక్కడి నుండి పారిపోయాను'' చెప్పడం పూర్తి చేశాడు బహద్దూర్.

పక్కనే ఉన్న పంకజ్ ''అంతా అబద్ధం రాత్రి పడుకున్న నాకు మెలకువే రాలేదు'' అన్నాడు కోపంగా.

''మిస్టర్ పంకజ్ రాత్రి రెండు గంటలకు నీకు మెలకువ రాలేదు సరే. కనీసం ఫోన్ కాల్ వచ్చిన సంగతయినా నీకు తెలుసా''

గుర్తు లేదన్నట్లుగా తలూపాడు పంకజ్.

వెంటనే ఫోన్ కాల్ రిజిస్టర్ చెక్ చేశాడు ఎస్. ఐ. నిజంగానే రాత్రి రెండుగంటల వేళ ఓ ఫోన్ కాల్ వచ్చినట్లు రికార్డ్ అయివుంది.

''పోనీ ఈ నంబర్ ఎవరిదో తెలుసా..?''

''తెలీదు''

ఆ నంబర్ గురించి ఆరా తీశారు పోలీసులు. ఆ నంబర్ చాణక్యపురిలోని ఓ పి.సి.ఓ. సెంటర్ నుండి వచ్చినట్టు గుర్తించారు.

పి.సి. ఓ. సెంటర్‌లో ఉన్న వ్యక్తి ఆ రాత్రి రెండు గంటల వేళ ఫోన్ చేసిన వ్యక్తి వివరాలు చెప్పలేక పోయాడు కాని ఆ వేళప్పుడు ఫోన్ చేసిన వ్యక్తి ఎక్కువగా మాట్లాడలేదుగాని పాత 'అనుపమ'

సినిమాలోని పాట పాడాడని తెలియజేసాడు.

అంటే ఈ పాటకు, హత్యకు ఏదో సంబంధం ఉన్నదనిపించింది ఎస్. ఐ.కు

★★★

''పంకజ్ ఆ రాత్రి మీ ఇంట్లోకి మూడో వ్యక్తి ఎవరో ప్రవేశించారని అనుమానం'' అంటూ తన అనుమానం వ్యక్తం చేశాడు రమాకాంత్.

''అవకాశమే లేదు. మేం డోర్ లాక్ చేసి పడుకున్నాం'' చెప్పాడు పంకజ్.

''డోర్ కీ ఎవరి దగ్గరుంటుంది..?''

''నా దగ్గర ఒకటి, మరొకటి బహద్దూర్ వద్ద ఉంది'' అన్నాడు.

''బహద్దూర్ దగ్గరి కీ ఎవరన్నా తీసుండొచ్చుగా..?'' అడిగాడు రమాకాంత్. అదే విషయాన్ని బహద్దూర్‌ని పిలిచి అడిగాడు.

''వారం రోజుల క్రితం నా దగ్గరున్న కీ ఎక్కడో పడిపోయింది. ఆ సంగతి చెబితే కోప్పడతారని ఎవ్వరికీ చెప్పలేదు'' అన్నాడు.

''మరో సంగతి మీకు చెప్పలేదు. ఆ రోజు సాయంత్రం కుమార్ బాబు వచ్చాడు. ఇద్దరి మధ్య ఏదో వాగ్యుద్ధం జరిగింది. ఆయన కోపంగా నీ అంతు చూస్తా అంటూ వెళ్ళిపోయాడు సార్''

''ఈ కుమార్ బాబు ఎవరు..?''

''పంకజ్ గారి స్నేహితుడు లోఢీ రోడ్‌లో ఉంటాడు'' అని చెప్పాడు.

అక్కడికి వెళ్తే ఈ హత్యకు సంబంధించిన క్లూ ఏదైనా దొరుకుతుందనిపించింది. లోఢీ రోడ్‌లోని కుమార్ ఇంటికి వెళ్ళాడు రమాకాంత్. కుమార్ ఇంటి ముందు 'కుమార్.. హిప్నాటిస్ట్' అన్న బోర్డు కనిపించింది.

అయితే ఆ సమయంలో కుమార్ ఇంట్లో లేడు. అతని అసిస్టెంట్ రాజు ఉన్నాడు. పంకజ్, మిన్నీల గురించి అడిగాడు. అతను ఓ ఫైల్ రమాకాంత్ చేతిలో ఉంచాడు. ఆ ఫైల్ తీసుకుని పోలీస్ స్టేషన్‌కు చేరి జాగ్రత్తగా స్టడీ చేశాడు రమాకాంత్.

★★★

తన గదిలో చికాగ్గా పచార్లు చేస్తున్నాడు పంకజ్. ఇంతలో సడన్‌గా ఫోన్ మోగింది, ఫోన్ అందుకున్నాడు. అందులో నుండి ఏదో పాట వినిపిస్తుంది. ఆ పాట వినగానే పంకజ్ ప్రవర్తనే మారిపోయింది. కళ్ళు ఎర్రబడ్డాయి. మొహంలో క్రౌర్యం చోటు చేసుకుంది. మనిషి ఆవేశంతో ఊగిపోతున్నాడు.

ఎదురుగా ఎవరన్నా ఉంటే పీక నులమాలన్నట్లుగా చేతులు ముందుకు చాచాడు. పని మనిషి మాల సరిగ్గా అదే సమయానికి కనిపించడంతో మాల గొంతును రెండు చేతుల్తో బిగించి పట్టాడు. మాల ఊపిరి తీసుకోలేక ఉక్కిరిబిక్కిరి అయింది. ఇంకో రెండు నిమిషాలయితే మాలకు ఊపిరి ఆగిపోతుందనిపించింది.

''హ్యాండ్సప్..'' అంటూ రమాకాంత్ అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

చేతులెత్తి పంకజ్ పక్కనే కుప్పకూలాడు. వెంటనే నీళ్ళు తాగించి కుర్చీలో కూర్చోబెట్టడంతో మాములు మనిషయ్యాడు పంకజ్.

''మిస్టర్ పంకజ్ మిన్నీ హత్యకు సూత్రధారి ఎవరో తెలిసింది'' అన్నాడు రమాకాంత్.


''ఎవరూ'' ఆత్రంగా అడిగాడు పంకజ్.

''నీ ఫ్రెండ్ కుమార్.. హిప్నటిస్ట్ కుమార్. అతను ఓ పాట ద్వారా నిన్ను తన ఆధీనంలో ఉంచుకున్నాడు. ఆ తరువాత అతనేం చెబితే ఆ పని నువ్వు చేస్తావు.

మిన్నీపై కన్నేసిన కుమార్‌ను ఆమె తిరస్కరించడమేకాక అతని బండారం బయటపెడతాననడంతో రాత్రి రెండు గంటలకు ఫోన్ చేసి పాట వినిపించి నీతో మిన్నీని హత్య చేయించాడు. అతని దగ్గర ఉన్న నీ కేసు ఫైల్లో ఇవన్నీ వివరాలు ఉన్నాయి'' అని తెలిపి కుమార్‌ను అరెస్ట్ చేశారు పోలీసులు. కేసు విచారణలో వుంది.

★

# బరువు తగ్గడానికి అయిదు సూత్రాలు



డైటింగ్ చేసి, శరీర బరువును తగ్గించుకోవచ్చుగాని, అది తాత్కాలికమే! ఆహారపు అలవాట్లు మార్చుకోవడం అంత ఆషామాషీ కాదు. జిహ్వా చాపల్యం మనిషిని స్థిరంగా ఉంచదు. ఒకవేళ పట్టుబట్టి డైటింగ్ చేసి బరువు తగ్గినా...బరువు తగ్గామన్న ఆనందంలో వెంటనే మళ్ళీ గతంలోలా తినేయడం మామూలే! అందుకని, ఈ డైటింగ్ ఇదంతా పక్కన పెట్టి, బరువు తగ్గడానికి కొన్ని మంచి అలవాట్లు చేసుకోండి. బరువు తగ్గాలంటే మంచి అలవాట్లతో పాటు, మంచి ప్రవర్తన కూడ చాలా అవసరం. అందుకు అయిదు సూత్రాలు ఉన్నాయి. దయచేసి పాటించండి!!

* ప్రతి రోజు వ్యాయామం తప్పని సరిగా చేయాలి. వ్యాయామం చేస్తే కేలరీలు ఖర్చవుతాయి. దీంతో బరువు తగ్గడమే కాదు, అందంగా కూడ కనిపిస్తాం. మార్నింగ్ వాక్, స్కిప్పింగ్...ఇంకా ఇలాంటివే చేస్తే దినచర్యలో ఎంతో తేడా కనిపిస్తుంది. మరిన్ని కేలరీలు ఇంకా బాగా ఖర్చుకావాలంటే వ్యాయామాన్ని మరింతగా చెయ్యడం మంచిది. కండలు తిరిగిన దేహంతో కనిపించారంటే కేలరీలు బాగా ఖర్చయినట్టే!
* ఇటీవల టీవీల ముందు, కంప్యూటర్ల ముందు కూర్చుని గంటల గ్గంటలు గడపడం బాగా అలవాటయింది. ఈ అలవాటుని మానుకుంటే మంచిది. వీడియో గేమ్స్ ఆడుకునేందుకు కేటాయించే సమయంలో నాలుగో వంతు కాలాన్ని అలా సరదాగా నడిచేందుకు కేటాయిస్తే బరువు తగ్గే అవకాశాలు ఉన్నాయి. అసలు రోజుకి రెండు గంటలు కంటే ఎక్కువ సమయాన్ని టీవీని చూసేందుకు కేటాయించడం ఎంత మాత్రం మంచిది కాదని డాక్టర్ల అభిప్రాయం. స్నేహితులతో షాపింగ్ చేయడం, బజార్లు చుట్టి రావడం...అలవాటు చేసుకోండి. మంచిది అంటున్నారు వైద్యులు.
* తీపి పదార్థాలు తినడం తగ్గించుకోవాలి. అలాగే జ్యూస్ డ్రింక్స్, సోడాలు, కొండకచో కూల్ డ్రింక్స్ కూడ తక్కువగా తాగడాన్ని అలవాటు చేసుకోవాలి. తాగాల్సి వస్తే తక్కువ మోతాదులో తాగడం మంచిది.
* ఆహారంగా పండ్లను ఎక్కువగా తీసుకోండి. చిప్స్, కుకీస్ తీసుకోకుండా పండ్లను తీసుకుంటే ఆరోగ్యానికి ఆరోగ్యమే కాకుండా హాయిగా కూడ ఉంటుంది.
* పొద్దున్నే ఏం తింటామని 'బ్రేక్ ఫాస్ట్' చేయడం మానుకోవడం, బరువు తగ్గాలంటే బ్రేక్ ఫాస్ట్ చేయకుండా ఉంటేనే మంచిదనుకోవడం... తప్పు. వేళకి బ్రేక్ ఫాస్ట్ చేయడం చాలా మంచిది. తింటే హాయిహాయిగా పని చేయగలిగి, కేలరీలను ఖర్చు చేయగలుగుతాం. లేదంటే బ్రేక్ ఫాస్ట్ చేయలేదని 'లంచ్' భారీగా లాగించేసి, కేలరీలను పెంచుకోవడంతో బరువు పెరగడం ఖాయం.

★